ఆర్టీఐని వినియోగించుకోవాలి

మాట్లాడుతున్న ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్

చిక్కడపల్లి, జూన్ 15: ఆర్టీఐని కాపాడుకోవాలని సమాజానికి పనికొచ్చే సమాచారాన్ని రాబట్టాలని కేంద్ర సమాచార మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు అన్నారు. హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హెచ్‌సీఎఫ్), పీపుల్స్ ఫ్రంట్ ఫర్ రైట్ టు ఇన్ఫర్మేషన్ సంయుక్తంగా ఆదివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఆర్‌టీఐ చట్టం అమలు తీరు – పొంచి ఉన్న ప్రమాదాలు' అనే అంశంపై చర్చ గోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సమాచార మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీఐ చట్టం చాలా విశిష్టత కలిగినదని, దానిని సక్రమంగా వినియోగించాలని సూచించారు. పిచ్చి పిచ్చి ప్రశ్నలతో అధికారులను వేధించటం కోసం కాక సమాజానికి, ప్రజానీకానికి ఉపయోగపడే సమాచారాన్ని రాబట్టేలా ప్రశ్నలను అడగాలని కోరారు. ప్రపంచంలోనే అతి గొప్ప సమాచార హక్కు చట్టం మనదేశంలో ఉన్నదని, అందుకు మనమంతా గర్వించదగిన విషయమని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై, మనందరిపై ఉన్నదన్నారు. హెచ్‌సీఎఫ్ ప్రధాన కార్యదర్శి వీరయ్య, పీఎఫ్‌ఆర్‌ఐ అధ్యక్షులు యాదయ్య అధ్యక్షత వహించిన సమావేశంలో ఆర్టీఐ యాక్టివిస్ట్ శ్రీనివాస్,ఆలిండియా లాయర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

శివ శివాని డిగ్రీ కళాశాల నూతన శాఖ ప్రారంభం

సిటీబ్యూరో, జూన్15, (నమస్తే తెలంగాణ): శివ శివాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ హైదరాబాద్‌లో తమ కొత్త శాఖను ప్రారంభించింది. ఆదివారం సోమాజిగూడలోని జయ గార్డెన్ ఎదురుగా నూతన డిగ్రీ కళాశాలను రాజ్యసభ సభ్యుడు నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు అరతి, సంపతి పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ నిలిపేయాలి

ముషీరాబాద్, జూన్ 15 :ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ 17న మహాధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఆదివాసి హననాన్ని ఆపాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆదివారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో విద్యానగర్ మార్క్స్‌భవన్ లో పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నగరంలో నకిలీ వైద్యులు

చదివింది యునాని.. చేసేవి సిజేరియన్లు

- అర్హత లేకున్నా శస్త్ర చికిత్సలు
- ఆసుపత్రి నిర్వహణకు సర్టిఫికెట్ల కొనుగోలు
- నకిలీ పత్రాలతో చార్మినార్‌లో షహీన్ దవాఖాన నిర్వహణ
- అమాయకుల ప్రాణాలతో చెలగాటం
- అందిన కాడికి దండుకుంటున్న వైనం

సిటీబ్యూరో/చార్మినార్,జూన్15, (నమస్తే తెలంగాణ): అమాయక ప్రజలే లక్ష్యంగా గ్రేటర్‌లో నకిలీ వైద్యులు చలామణి అవుతున్నారు. అర్హత లేకున్నా వైద్య శస్త్ర చికిత్సలు చేస్తూ రోగుల ప్రాణాలు తీస్తున్నారు. ప్రాణం పోయిన తరువాత తమకేం సంబంధం లేదని బోర్డులు తిప్పుకుంటున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ వైద్యులపై మెడికల్ కౌన్సిల్ చర్యలు తూతూ మంత్రంగా సాగుతుండటం గమనార్హం. చార్మినార్ ప్రాంతంలోని షహీన్ ఆసుపత్రి నిర్వహణ అనుమతి కోసం ఓ వైద్యురాలు తన ధ్రువపత్రాలను ఆ ఆసుపత్రి యాజమాన్యానికి అమ్ముకుంది. తాను వేరే చోట వైద్యం చేసుకుంటుండగా తన పేరుతో ఉన్న ఆ ఆసుపత్రిలో షాహీన్ బేగం, భాషా కలిసి వైద్యం చేస్తున్నారు. బ్యాచ్‌లర్ ఆఫ్ యునాని మెడిసిన్ అండ్ సర్జరీ(బీయూఎంఎస్)కోర్సు చేసిన వీళ్లు అర్హత లేకున్నా వైద్యం చేస్తుండటం గమనార్హం. సర్జరీలు, అబార్షన్లు, ప్రసవాలు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు.

రోగి మరణిస్తే బేరసారాలు...

శస్త్ర చికిత్సల సమయంలో వైద్యం వికటించి రోగి మరణిస్తే రోగి బంధువులతో కలిసి ఆ విషయం బయటికి తెలియకుండా బేరసారాలకు దిగుతున్నారు. ఆసుపత్రిపై దాడి చేయకుండా రక్షణ కోసం ప్రైవేట్ మనుషులను పెట్టుకుని అమాయకులను మోసం చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి లో కర్నూల్‌కు చెందిన ఓ వివాహిత పురిటి నొప్పులతో షహీన్ దవాఖానలో చేరింది. ఆమెకు ఐదు రోజులు వైద్యమందించి సిజేరియన్ చేశారు. చికిత్స వికటించి ఆమె మృతిచెందింది. ఈ సంఘటన బయటికి రాకుండా ఆసుపత్రి వైద్యులు జాగ్రత్త పడ్డారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం ఇస్తామంటూ ఒప్పించారు.

తనిఖీలకు మంగళం...

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సుమారు పదివేల ప్రైవేట్ ఆసుపత్రులు రిజిస్టర్ కాగా, వాటిలో 70శాతం ఆసుపత్రుల్లో తమ పేరుతో రిజిస్ట్రేషన్ ఉన్న వైద్యులు కాకుండా ఇతరులు వైద్యం చేయడం గమనార్హం. ఇలా సంవత్సరాల తరబడి అర్హత లేని వ్యక్తులతో వైద్యం చేయిస్తూ, అసలైన వైద్యులు బడా కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్నారు. అసలు ఒక వ్యక్తి వైద్యం అందించాలంటే ముందుగా అతను జాతీయ మెడికల్ కౌన్సిల్ గుర్తించిన మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలి. అప్పుడే అతడు వైద్యం చేసేందుకు అర్హుడు. దానితో పాటు ఆసుపత్రి నడపాలంటే జిల్లా వైద్యాధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. క్లినిక్, ఆసుపత్రిల లైసెన్స్ విషయంలో జిల్లా వైద్యాధికారిదే నిర్ణయం. ఈ తరహా అనుమతులు ఇచ్చి ఇటు జిల్లా వైద్యశాఖ, మరోవైపు మెడికల్ కౌన్సిల్ తనిఖీలు చేయకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆడిందే ఆట పాడిందే పాట తీరుగా సాగుతుంది.

ఎల్లమ్మ కల్యాణానికి ఏర్పాట్లు చేయండి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సత్కరిస్తున్న ఆలయ ఈవో మహేందర్‌రెడ్డి

బేగంపేట్ జూన్ 15 అందరి సమన్వయంతో బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణానికి ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం నూతన ఈవో గా బాధ్యతలు చేపట్టిన మహేందర్ గౌడ్ ఆదివారం వెస్ట్ మారేడ్ పల్లి లోని నివాసంలో మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. ఎమ్మెల్యేను నూతన ఈవో శాలువా, పూలమాలతో సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన ఈవో కు శుభాకాంక్షలు తెలిపారు. జూలై 1 వ తేదీన నిర్వహించే బల్కంపేట ఎల్లమ్మ కల్యాణానికి లక్షలాది మంది భక్తులు వస్తారని, జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈవో వెంట ఆలయ ట్రస్ట్ చైర్మన్ సాయిబాబా ఉన్నారు.

సర్దార్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

సర్దార్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

సర్దార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, శ్రీనివాస్‌రెడ్డి

వెంగళరావునగర్, జూన్ 15 : బీఆర్ఎస్ బోరబండ మైనార్టీ నాయకుడు సర్దార్‌ది ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. బోరబండ కాంగ్రెస్ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ వేధింపులకు బలైన సర్దార్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల్ని వేధిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వపాలన సాగుతుందని విమర్శించారు. సర్దార్ ఇంటిని కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా కూల్చేసిందని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు కాంగ్రెస్ కండువాలను ధరించిన కార్యకర్తల్లా పనిచేస్తున్నారని విమర్శించారు. ఎంతో కష్టపడి కట్టుకున్న పేదల ఇళ్లను పోలీసులతో కూల్చడం దారుణమన్నారు. సర్దార్ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ త్వరలోనే పరామర్శించడానికి వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్యరావు, యూసుఫ్ గూడ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కబ్జాపై చర్యలేవీ?

ప్రభుత్వానికి నివేదికలు సమర్పించిన రెవెన్యూ అధికారులు

మేడ్చల్, జూన్15(నమస్తే తెలంగాణ): మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని దేవాదాయశాఖ భూములు కబ్జాలకు గురైన నివేదికలను జిల్లా రెవెన్యూ యంత్రాంగం ప్రభుత్వానికి సమర్పించినట్లు సమాచారం.కబ్జాలకు గురై నిర్మాణాలు చేపట్టిన దేవాదాయశాఖకు చెందిన సర్వే నంబర్లతో సహా నివేదికలను ఇచ్చినట్లు తెలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 1531 ఎకరాల దేవాదాయ భూములు ఉన్నట్లు దేవాదాయ, రెవెన్యూ రికార్డుల్లో ఉంది. అయితే ఇటీవల దేవాదాయ భూములు కబ్జాలకు గురై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమై కబ్జాల వివరాలను సేకరించింది. ప్రధానంగా తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవర్‌యాంజల్‌లోనే ఈ భూములు 55 నుంచి 63, 639–641, 656, 657, 660–682, 686–718, 736 సర్వే నంబర్లలో ఉన్నాయి.

నివేదికలు ఇచ్చిన నిర్లక్ష్యం..

దేవాదాయ భూముల్లో జరిగిన కబ్జాలపై రెవెన్యూ అధికారులు నివేదికలను ప్రభుత్వానికి సమర్పించిన చర్యలు తీసుకునేది ఎప్పుడని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. రికార్డుల ప్రకారం 1531 దేవాదాయ భూములు రికార్డుల్లో ఉన్నప్పటికీ ఇప్పుడు మాత్రం ఇందులో సుమారు 2 వందల ఎకరాల పైచిలుకు భూములు కబ్జాలకు గురైనట్లు అధికారులు వద్ద సమాచారం ఉన్నట్లు తెలుస్తుంది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దేవాదాయ భూముల కబ్జాలపై నిగ్గు తేల్చేందుకు త్రిసభ్యకమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే దేవాదాయ భూములను కబ్జాలకు చేసి గోదాంలు, రిస్టార్ట్స్, ఫంక్షన్‌హాళ్లు తదితర వాటిని నిర్మించుకుని కోట్లలో కబ్జాదారులు అక్రమార్జన చేసుకుంటున్నారు. అనుమతులు లేకుండా నిర్మించిన వాటిపై ఎలాంటి ఆస్తిపన్నులు చెల్లించకపోడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది.

ముగిసిన 'నైట్ వాక్, నేచర్ క్యాంపు'

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : ఫారెస్టు పార్కుల్లో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి మొదలైన 'నాక్టిర్నల్ వాక్ (నైట్ వాక్), నేచర్ క్యాంపు' ఆదివారం ఉదయం ముగిసింది. 12 మంది ప్రకృతి ప్రేమికులు తమ నైట్ ఫారెస్టు వాక్‌ను విజయవంతంగా ముగించారు. డెక్కన్ ఉడ్స్ అండ్ టైల్స్, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ(టీజీఎఫ్‌డీసీ) సంయుక్తంగా పలు ఫారెస్టు పార్కుల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించాయి. ఫారెస్టు ట్రెక్ పార్క్, మంచిరేవుల, చిల్కూరు రిజర్వ్ ఫారెస్టు, బొటానికల్ గార్డెన్ వంటి వాటిలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. అభివృద్ధి చేసిన ఈ క్యాంపు సైట్ ఇప్పుడు ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు, కళాకారులతోపాటు పాఠశాలల కోసం అందుబాటులో ఉందని టీజీఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ వెల్లడించారు.

శిల్పకళకు ఆద్యుడు విశ్వకర్మ

సూరారంలో విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ

దుండిగల్, జూన్ 15: శిల్పకళకు విశ్వకర్మ ఆద్యుడని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధి, సూరారం గ్రామంలోని విశ్వకర్మ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విరాట్ విశ్వకర్మ భగవాన్ విగ్రహాన్ని ఎమ్మెల్యే వివేకానంద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ ప్రాచీన శిల్పకళకు ఆద్యుడని అన్నారు. ప్రతి సంవత్సరం విశ్వకర్మ జయంతిని కుత్బుల్లాపూర్‌లో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, విశ్వకర్మ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానందం, పోచమ్మ దేవాలయం చైర్మన్ జీవన్ రెడ్డి, శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సేవ సంఘం అధ్యక్షుడు కృష్ణ మాచారి, కార్యనిర్వాహక అధ్యక్షుడు కమ్మరి లక్ష్మణచారి, సమ్మిరెడ్డి, వాసుగుప్త, పెంటాచారి, సోమచారి,రామాచారి, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కనకచారి, కస్తూరి బాల్ రాజ్, కమలాకర్, ఏవీ శేషాచారి, సాయి పాల్గొన్నారు.

చేవెళ్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

హైదర్షాకోట్‌లో సమావేశమైన నేషనల్ హైవే సాధన సమితి సభ్యులు

బండ్లగూడ, జూన్ 15: తెలంగాణ పోలీసు అకాడమీ నుంచి చేవెళ్ల మన్నెగూడ వరకు ఇరుకుగా ఉన్న రహదారిని విస్తరించి ప్రమాదాలు లేకుండా చేయాలని నేషనల్ హైవే విస్తరణ సాధన సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. హైదర్ షా కోట్ గ్రామంలో ఓ పాఠశాలలో సాధన సమితి సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి ఇరుకైన రోడ్డుతో ఏర్పడుతున్న ఇబ్బందులను చర్చించి రహదారి విస్తరణ ఆవశ్యకత గురించి మాట్లాడారు. గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ప్రతినిధులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తే గాని జాతీయ విస్తరణ జరిగేటట్టు లేదని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. నగరానికి కూత వేటు దూరంలో ఉన్న ఎన్‌హెచ్ 163 రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడం, నత్త నడకన నడవడం శోచనీయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా ఈ కార్యాచరణను ముందుకు తీసుకోవడానికి నియోజకవర్గాల వారీగా చేవెళ్ల, పరిగి, వికారాబాద్, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ రోడ్డు నిర్మాణం సకాలంలో నిర్మించకపోవడం, విస్తరించకపోవడం వల్ల ఎంతోమంది ప్రాణాలు నష్టపోవడం జరుగుతుందని దీనిని దృష్టిలో ఉంచుకొని సత్వరమే రోడ్డు విస్తరణ పనులు చేపట్టే వరకు ఈ ప్రాంతంలో దశలవారీగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అమరేందర్ గౌడ్, సీపీ రెడ్డి, మనోహర్, గోపీనాథ్, భీమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5 నెలలుగా జీతాల్లేవ్

- వైద్యవిధాన పరిషత్‌లో పస్తులుంటున్న పారిశుధ్య, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది
- గత ప్రభుత్వంలో సకాలంలో వేతనాలు
- 6 నెలలకోసారి జీతాలిస్తున్న కాంగ్రెస్ సర్కారు

ధర్నా చేస్తున్న పారిశుధ్య, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది

సిటీబ్యూరో, జూన్15, (నమస్తే తెలంగాణ): వాళ్లంతా చిన్నపాటి జీతంతో బతుకులీడ్చేవాళ్లు. సామాన్య ప్రజలకు వైద్యమందించే సర్కారు దవాఖానలను శుభ్రపరిచేవారు. ఆ ఆసుపత్రులను కాపుకాసేవారు. కానీ వారి రెక్కల కష్టం విలువ నెలకు రూ. 11000లు మాత్రమే. ఆ జీతం కూడా ఐదు నెలలుగా ఆపేయడంతో వారంతా అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తున్నారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్(టీవీవీపి) పరిధిలో ఉన్న జిల్లా, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక పట్టణ కేంద్రాలలో పనిచేసే శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి ఐదు నెలలుగా జీతాలు అందలేదు. బీఆర్ఎస్ పాలనలో ప్రతినెలా జీతాలు తీసుకున్న వాళ్లు, కాంగ్రెస్ పాలనలో పస్తులుండే పరిస్థితి ఏర్పడ్డది.

ఐదు నెలలుగా పెండింగ్‌లోనే...

రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ వైద్యవిధాన పరిషత్(టీవీవీపీ) పరిధిలో ఉన్న ప్రభుత్వాసుపత్రుల్లో 3600కు పైగా సిబ్బంది శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీలుగా కాంట్రాక్ట్ ప్రాతిపాదికన విధులు నిర్వహిస్తున్నారు. గత బీఆర్ఎస్ సర్కారులో మంత్రి హరీశ్ రావు చొరవతో వేతనాలు పెంచి, ప్రతినెల తప్పనిసరిగా వారి ఖాతాల్లో వేతనాలు జమ అయ్యేవి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు సైతం ప్రభుత్వం నుంచి విడుదలైన వెంటనే సిబ్బంది ఖాతాల్లో వేతనాలు జమ చేసేవారు. సకాలంలో ఈఎస్ఐ, పీఎఫ్‌లు సైతం చెల్లించేవారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పద్ధతికి స్వస్తి పలికింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతినెలా వేతనాలు ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రతి నెల అందించే వేతనాలు కాస్త ఆరు నెలకోసారి వేయడం ప్రారంభించారు. ఈ ఏడాది జనవరి నుంచి కాంట్రాక్టర్లకు వేతనాల సొమ్ము విడుదల చేయకపోవడంతో సిబ్బందికి ఇవ్వాల్సిన వేతనాలు నిలిచిపోయాయి. ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆవేదనతో సిబ్బందంతా కలిసి కాంట్రాక్టర్లను నిలదీసినా ఫలితం శూన్యంగానే మిగిలింది. రాష్ట్రవ్యాప్తంగా శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బందికి ఐదు నెలలుగా సుమారు రూ.28 కోట్ల పెండింగ్ వేతనాలు చెల్లించాల్సి ఉంది. కానీ వాటిని ఇప్పటివరకు కూడా చెల్లించకపోవడం గమనార్హం. జీతాల కోసం అధికారులను కలిసి ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా కూడా పట్టించుకోకుండావాటిని విస్మరిస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వమే తమ బాధను విస్మరిస్తే ఎవరితో చెప్పుకోవాలంటూ వాపోతున్నారు.

పస్తులుండే కాలమొచ్చింది..

ప్రతి నెల తీసుకునే జీతంలోనే ఇంటి అద్దెలు కట్టుకుంటూ, కుటుంబాన్ని పోషించుకుంటున్న సిబ్బందికి వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులుపడుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. . పెరిగిన నిత్యావసర ధరల కారణంగా చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఇదిలా ఉండగా మరోవైపు కాంట్రాక్టర్ల టెండర్ ఈ ఏడాది మార్చిలోనే ముగిసినా ప్రభుత్వం కొత్త టెండర్‌కు ఆహ్వానం పలకలేదు. కనీసం కొత్తటెండర్ వచ్చి కాంట్రాక్టర్లు మారితేనైనా వేతనాలు పెంచుతారని ఆశతో ఎదురుచూస్తున్నారు. పెండింగ్ వేతనాలు విడుదల చేసి, కొత్త టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వేతనాలు విడుదల చేయాలి

శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలి. ఐదు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటం కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి. కొత్త టెండర్లు పిలిచి సిబ్బందికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–నర్సింహ, మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ, ఏఐటీయూసీ

వోలేటి పార్వతీశంకు ద్వానాశాస్త్రి పురస్కారం

ముషీరాబాద్, జూన్ 15: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో ప్రముఖ సాహితీ వేత్త వోలేటి పార్వతీశం కు ద్వానాశాస్త్రి స్మారక పురస్కారం ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ సలహదారు డాక్టర్ కె.వి రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని వోలేటి పార్వతీశంకు ద్వానాశాస్త్రి పురస్కారాన్ని బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గొప్ప విమర్శనాత్మక రచనలు చేయడంలో ద్వారాశాస్త్రికి సాటి లేరన్నారు. కవిత్వం, విమర్శలు కథనాలు, అరుదైన ఛాయ చిత్రాలు అతడి సొంతమన్నారు. వల్లీశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బైసా దేవదాస్, శైలజా మిత్ర, ద్వాదశి శశికాంత్, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

వోలేటి పార్వతీశంకు పురస్కారాన్ని అందిస్తున్న రమణాచారి

ఫీజు రీయింబర్స్‌మెంట్

300 కోట్లు పెండింగ్

కళాశాలల ఒత్తిడితో ఇబ్బందుల్లో విద్యార్థులు

మేడ్చల్, జూన్15(నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఫీజుల కోసం కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి తేవడంతో ఫీజులు కట్టలేక ఎటు తేల్చుకోలేక పోతున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఇంటర్ నుంచి పీజీ వరకు ఎస్సీ విద్యార్థులు 28 వేలు, బీసీ విద్యార్థులు 40 వేలు, మైనార్టీ, ముస్లింలు 15 వేల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై అధారపడి చుదువు కోంటున్నారు. విద్యార్థులు ఫీజులు సుమారు రూ. 3 వందల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో వేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులను తెచ్చి పెట్టినట్లయింది. కళాశాల యాజమాన్యాలు ఒత్తిడి తేస్తే విద్యార్థులు అధికారుల చుట్టూ తిరాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2023 నుంచి 2025 విద్యాసంవత్సరం వరకు వివిధ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాల్సి ఉంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను మొదట నిబంధనల మేరకు విద్యార్థుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం జమ చేయాల్సి ఉంటుంది. జమ చేసిన నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి పంపితే మిగతా 60 శాతం నిధులను నేరుగా విద్యార్థుల ఖాతాలో జమ కానుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం జమ చేయని కారణంగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో ఆలస్యం అవుతుందని తెలుస్తోంది. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నేరుగా విద్యాసంస్థలకే వెళ్లనుండగా కొత్త నిబంధనల మేరకు విద్యార్థుల ఖాతాల్లోనే జమ చేయలన్నా కొత్త నిబంధనలు ఇబ్బందులు తెచ్చాయి. ఇప్పటికైనా ప్రభు త్వం విద్యార్థులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 86 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సి ఉంది.

ఘనంగా డిప్యూటీ సీఎం 'భట్టి' జన్మదిన వేడుకలు

ఆర్కే పురం, జూన్ 15 : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తన జన్మదిన వేడుకలను ఆదివారం కొత్తపేటలోని విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మధుయాష్కి గౌడ్, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, లింగాజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత దీప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు